# ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



తిర్మాలాపూర్‌లో పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

రాయపోల్, మే 2 : పెద్దమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుఖసంతోషలతో జీవించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి , ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలంలోని తిర్మాలాపూర్‌లో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో పాటు అయురాగ్యోలతో ఉండే విధంగా చూడాలని అమ్మవారికి మొక్కులు చెల్లించినట్లు పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అనంతరం దుబ్బాక నియోజక వర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త రణం శ్రీనివాస్‌గౌడ్ గృహప్రవేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు సోలిపేట సతీష్‌రెడ్డి, దౌల్తాబాద్ మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు బండారు దేవేందర్, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు యాదవరెడ్డి, దొమ్మట మాజీ సర్పంచ్ పూజిత వెంకట్‌రెడ్డి, నాయకులు గడ్డం నాగరాజు, గ్రామ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, జిల్లా యూత్ నాయకులు కలిలోద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, మే 2 : ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణానికి చెందిన రహుఫ్‌కు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 హామీలను నెరవేర్చి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. నేడు గ్రామాల్లో తాగునీరు సరిపడా రాకపోవడంతో ప్రజలు వేసవిలో ఇబ్బందిపడుతున్నరని తెలిపారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, నాయకులు శ్రీధర్, అల్తాఫ్ పాల్గొన్నారు.

# నిశ్వార్థ రామభక్తి అమోఘం



తలంబ్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, మే 2: కోటి తలంబ్రాల దీక్షలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసి రామరాజు తన నిశ్వార్థ రామభక్తిని చాటుకోవడం అమోఘమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. శుక్రవారం ముత్యాల తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా రామకోటి భక్తసమాజం అధ్యక్షుడు రామరాజును జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, సామాజిక సమరత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, మే 2 : ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తయిన విద్యార్థులు ఈనెల 4న నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మట్టయ్య చౌదరి శుక్రవారం తెలిపారు. ఈ నెల 4న ప్రగతి కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు, ఇంటర్‌లో ఫార్మటెక్, ఎంఎల్‌టీతో పాటు ఎంపీసీ, బైపీసీ, బీఎస్సీ (కెమిస్ట్రీ) అభ్యసించిన విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. సర్టిఫికెట్లతో పాటు ఆధార్, పాస్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

# మెరుగైన వైద్య సేవలందించాలి

**రాష్ట్ర వైద్యావిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్**



దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

దుబ్బాక, మే 2 : ప్రభుత్వ దవాఖానలకు వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, ప్రజా వైద్యంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ సూచించారు. శుక్రవారం దుబ్బాక వంద పడకల దవాఖానను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. దవాఖాన వార్డులతో పాటు ల్యాబ్, వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రధానంగా (డెలివరీలు) ప్రసవాలు, శస్త్ర చికిత్సల సంఖ్య చాలా స్వల్పంగా ఉందన్నారు. మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారి హేమరాజ్‌కు సూచించారు. దవాఖానకు డ్రైనేజీ సమస్య ఉండటంతో త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

# మోడల్ జూనియర్ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, మే 2: గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్ ప్రాంగణంలోని మోడల్ జూనియర్ కళాశాలలో పదో తరగతి పాస్ అయిన విద్యార్థుల నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వన్నెసా శుక్రవారం తెలిపారు. ఈ నెల 5 నుంచి 20వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 26న సెలెక్షన్ లిస్టు పెడుతామని , 27 నుంచి 31 వరకు ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. కళాశాలలో ఎం పీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లుండగా ఒక్కో గ్రూప్‌లో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి పాస్ అయి న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కల్హేర్, మే 2: తన కారు డ్రైవర్ రమేశ్ అన్న జైపాల్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. కల్హేర్ మండలం బీబీపేట్ తండాకు చెందిన జైపాల్ వడదెబ్బ కారణంగా అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేకు వివరించారు. మాజీ ఎమ్మెల్యే, జైపాల్ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు రాంసింగ్, నాయకులు బలరామ్, రాములు నాయక్, ప్రశాంత్‌సాగర్ ఉన్నారు.

జైపాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



# వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**కలెక్టర్ మనుచౌదరి**

సిద్దిపేట, మే 2 : వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వడదెబ్బ బారిన పడకుండా జిల్లా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. తప్పనిసరిగా ప్రజలు జాగ్రత్తలు పాటించేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్నం సమయంలో వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, ఒకవేళ బయటకు వెళ్లాల్సి వచ్చినా తలకు టోపీ ధరించడం, తువ్వాల చుట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండ వేడిమి సమయాల్లో సాధ్యమైనంత వరకు ప్రయాణాలు పెట్టుకోకూడదని, చల్లదనాన్ని అందించే నీడ ప్రదేశాల్లో ఉండాలని సూచించారు. సాధారణ సమయాలకంటే వేసవిలో ఎక్కువ మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోవాలని, తేలికపాటి కాటన్ వస్త్రాలను ధరించడం వంటివి చేయాలని, త్వరగా వడదెబ్బకు లోనయ్యే స్వభావం కలిగిన వారు విధిగా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ తెలిపారు. వృద్ధులు, చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, సముదాయాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వేసవి తీవ్రత వల్ల వడదెబ్బకు లోను కాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ మేరకు ఉపాధి హామీ కార్మికులు ఉదయం వేళలోనే పనులు చేసేలా, తాగునీటి వసతి అందుబాటులో ఉండే విధంగా జిల్లా యం త్రాంగం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ఎవరైనా వడదెబ్బకు గురైతే, వెంటనే వారిని సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్తే, తక్షణ చికిత్స అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

సిద్దిపేట అర్బన్, మే 2 : ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావుతో కలిసి భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై మంత్రి శ్రీనివాస్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక ఎంత వరకు పూర్తయితే అంతవరకు ఏ రోజుకారోజూ ఇన్‌చార్జి మంత్రుల నుంచి లబ్ధిదారుల జాబితాకు ఆమోదం తీసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా జరిగేలా కలెక్టర్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనర్హులని తేలితే నిర్మాణం మధ్యలో కూడా రద్దు చేస్తామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ నెల 4న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూ చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మను చౌదరి, పోలీస్ కమిషనర్ అనురాధ, అదనపు కలెక్టర్లు గరిమా అగర్‌వాల్, అబ్దుల్ హమీద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆదిశంకరాచార్యుల జయంతి



చేర్యాల సద్గురు భవనంలో విశేష పూజలందుకున్న ఆది శంకరాచార్యులు

చేర్యాల, మే 2: చేర్యాల పట్టణం శృంగేరినగర్‌లోని సద్గురు సదనంలో ప్రతిష్ఠితమైన ఆదిశంకర మందిరంలో శుక్రవారం ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. నాలుగు ధర్మ పీఠాలను స్థాపించి, అఖండ భారతావనిలో సనాతన ధర్మాన్ని వ్యాప్తిచేసిన సాక్షాత్తు శంకర స్వరూపులైన ఆదిశంకరుల పుట్టిన రోజును పురస్కరించుకొని ఆదిశంకర మూలమూర్తికి పూర్ణాభిషేకం, గురుపూజ, శారదాచంద్రమౌళీశ్వరునికి మంత్రపుష్పాలతో విశేష అర్చన జరిపించారు. భక్తులు ఆలపించిన సౌందర్యలహరి స్తోత్రం తన్మయత్వానికి గురిచేసింది. అనంతరం తీర్థ ప్రసాద, అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు.

# నాగపురిలో ముందస్తు 'బడిబాట'



బడిబాటలో పాల్గొన్న మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

చేర్యాల, మే 2 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని చేర్యాల మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అన్నారు. శుక్రవారం చేర్యాల మండలంలోని నాగపురిలో హైస్కూల్ హెచ్‌ఎం ఎలికట్టె ఐలయ్య ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ కుందరం రాములు, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, మనోజ్ కుమార్, ప్రకాశ్‌రెడ్డి, స్వర్ణ కుమార్, కనకలింగం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మలకు విద్యుత్ పథకం అమలు చేయాలి

సిద్దిపేట టౌన్, మే 2 : విశ్వకర్మలకు విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని అఖిల భారత విశ్వకర్మ పరిషత్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నరసింహాచారి అన్నారు. అర్హత కలిగిన విశ్వకర్మ వృత్తుల వారికి 4వ కేటగిరి ద్వారా నాలుగు రూపాయలకే యూనిట్ విద్యుత్‌ను అందించాలని ఎలక్ట్రిసిటీ రెగ్యులరైజేషన్ అనుమతి ఇచ్చిన నేపథ్యంలో విశ్వకర్మలు సిద్దిపేట ఎస్ఈ చంద్రమోహన్‌ను కలిసి విద్యుత్ పథకం అమలు పర్చాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరసింహాచారి మాట్లాడుతూ ఎస్ఈ చంద్రమోహన్ సానుకూలంగా స్పందించారని అర్హత గల వారందకీ విద్యుత్ పథకం అందిస్తామని చెప్పారన్నారు. అనంతరం చంద్రమోహన్‌ను సన్మానించారు. సంఘ నాయకులు బాలయ్య, యాదగిరి, రామచంద్రం, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


# మృతుల కుటుంబాలకు పరామర్శ



బెజ్జంకిలో పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, మే 2 : మండల కేంద్రానికి చెందిన టేకు రంగవ్వ అనే మహిళ పిడుగుపాటుకు గురై మృతి చెందగా, గుండారం గ్రామానికి చెందిన కొరుకొప్పుల నారాయణ ఇటీవల మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం మృతుల కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, రామాలింగారెడ్డి, రమేశ్, భూమయ్య, శ్రీధర్, రాజిరెడ్డి, రాములు, అంజయ్య తదితరులు ఉన్నారు.

# కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ విజయ

ములుగు, మే 2 : కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఏఎంసీ చైర్‌పర్సన్ విజయ, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రభాకర్ శుక్రవారం అందజేశారు. ములుగులోని రైతు వేదికలో మండలానికి చెందిన 35 మంది లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. తహసీల్దార్ ఆరీఫా, సిబ్బంది పాల్గొన్నారు.

# మారణ హోమాన్ని నిలిపివేయాలి



మాట్లాడుతున్న మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు రంగాచారి

సిద్దిపేట టౌన్, మే 2 : ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలపై జరుగుతున్న దాడిని, మారణ హోమాన్ని నిలిపివేయాలని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు, కవులు, రచయితలు కేంద్రాన్ని కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్ శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంజీరా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగాచారి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న ఆపరేషన్ మూలంగా ఛతీస్‌గఢ్ అడవుల్లో నివసిస్తున్న అమాయక ఆదివాసీ, గిరిజన ప్రజలు మరణిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి శాంతి చర్చలు జరపాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, అశోక్, యాదగిరి, భగవాన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# కేంద్ర నిర్ణయాలతో బీడీ కార్మికులకు అన్యాయం

**బీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి మంచె నర్సింహులు**



జెండా ఆవిష్కరణలో బీఆర్టీయూ నాయకులు

సిద్దిపేట కమాన్, మే 2 : బీజేపీ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని బీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి మంచె నర్సింహులు అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో ఇప్పటికే చాలా వరకు బీడీ కంపెనీలు మూతపడ్డాయని మరికొన్ని మూతపడేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ కంపెనీలు మూతపడడంతో ఎంతో మంది కార్మికుల బ్రతుకులు రోడ్డున పడతాయని వాపోయారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని దేశాయ్ బ్రదర్స్ బీడీ కంపెనీ వద్ద బీఆర్టీయూ నాయకులు జెండా ఆవిష్కరించారు. అనంతరం కార్మికులకు మిఠాయిలు పంచి కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ప్రభుత్వ నిర్ణయాలతో కార్మికులకు చేతి నిండా పని దొరకడం లేదని ఆరోపించారు. కార్మిక చట్టాల విషయంలో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 20న జాతీయ కార్మిక సమ్మె నిర్వహిస్తున్నామని, ఈ సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ నాయకులు శోభన్, శ్రీనివాస్, మల్లారెడ్డి, అంబక్క, మై ముద బేగం పలువురు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు సన్మానం




కౌన్సిలర్, కార్మికులకు సత్కరిస్తున్న కాలనీ వాసులు

సిద్దిపేట టౌన్,మే 2 : సఫాయి అన్నల సేవలు గొప్పవని కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని 5 వార్డులో ఉత్తమ సేవలు అందిస్తున్న కౌన్సిలర్ వినోద్ గౌడ్, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ శుక్రవారం ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు.

# పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

నంగునూరు, మే 2 : డిప్లొమా కోర్సులో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ 2025 రాసే అభ్యర్థుల కోసం మండల పరిధిలోని రాజగోపాల్‌పేట ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అలుగోజు గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిపుణులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులకు తరగతులు నిర్వహించడంతో పాటు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 9000363725, 9010 2221 89 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# దళిత యువకుడిపై దాడిచేసిన వారిని శిక్షించాలి



చేర్యాల సీఐకి వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘాల నేతలు

చేర్యాల, మే 2 : చేర్యాల మండలం వేచరేణిలో దళిత యువకుడిపై దాడిచేసిన ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని కోరుతూ శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో చేర్యాల సీఐ శ్రీనుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడారు. వేచరేణి గ్రామానికి చెందిన బేడబుడగ జంగాల కులానికి చెందిన (మతిస్థిమితం లేని) ఊపిరి అజయ్ కుమార్ దళిత యువకుడిపై గోడకు కట్టేసి దాడి చేసినట్లు తెలిపారు. దాడి చేసిన వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. మతం పేరుతో దళితుల మీద దాడి చేయడం అమానుషమన్నారు. దళిత సంఘాల నాయకులు మల్లిగారి యాదగిరి, రామగళ్ల నరేశ్, భూమిగారి రాజేందర్, బక్కెల్లి బాలకృష్ణ, ప్రసాద్, జేరిపోతుల పరశురాములు, మల్లిగారి రాజు, బుట్టి భిక్షపతి, బుట్టి సత్యనారాయణ, పుట్టరాజు, కొండ్ర మల్లేశ్, మల్యాల శ్రీనివాస్, భూమిగారి మధుకర్, ప్రేమ్ కుమార్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# దళారులను ఆశ్రయించొద్దు

మిరుదొడ్డి, మే 2 : రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్యా అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను సందర్శించి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా డీఆర్డీవో జయదేవ్ ఆర్యా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి ఎంపీడీవో గణేశ్ రెడ్డి, ఏపీఎం దాకయ్య, సీసీలు, టీఏ లు, రైతులు పాల్గొన్నారు.

# అకాల వర్షం.. తడిన ధాన్యం



కమ్మర్‌పల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

దుబ్బాక, మే 2 : దుబ్బాక మండలంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని కమ్మర్‌పల్లి, చీకోడు, ఆరెపల్లి గ్రామాల్లో వడగండ్ల వర్షం పడింది. వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయ్యింది.

# వేచరేణిలో యువకుడికి దేహశుద్ధి

చేర్యాల, మే 2 : సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని వేచరేణి గ్రామ శివారు ఎల్లదాసునగర్‌కు చెందిన ఓ యువకుడిని గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. నాలుగు రోజుల క్రితం ఆజయ్ అనే యువకుడు గ్రామంలోని ఓ వర్గం విగ్రహాలను అపవిత్రం చేశాడు. దీంతో గ్రామస్తులు ఆ యువకుడిని పటుకొని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. అంతేకాకుండా ఆ యువకుడిని గ్రామంలో అర్ధనగ్నంగా ఊరేగించారు. యువకుడు అజయ్ మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడని, తన తల్లిని సైతం చంపుతానని పలుమార్లు బెదిరించాడని, మహిళలతో అసభ్యంగా వ్యవహరిస్తుండేవాడని గ్రామస్తులు తెలిపారు. అజయ్ చేష్టలతో భార్య సైతం విడాకులు ఇచ్చి వెళ్లిపోయింది. అయినప్పటికీ అతడిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో తల్లి సైతం కొన్ని నెలలుగా వేచరేణిలో అంబేద్కర్ భవనంలో తలదాచుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై సీఐ శ్రీనును 'నమస్తే తెలంగాణ'లో ఫోన్‌లో వివరణ కోరగా.. ఈ ఘటన తమ దృష్టికి వచ్చిందన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ములుగు, మే 2 : గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మండల పరిధిలోని బస్వాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మం డల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైందని తెలిపారు. దుండగులు హతమార్చి పెట్రోల్ పోసి తగులబెట్టినట్లుగా ఆనవాళ్లు కనిపిస్తున్నాయని వెల్లడించారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# విద్యార్థులకు సన్మానం

చేర్యాల, మే 2 : 10వ తరగతి పరీక్షల్లో మండలంలోని ఆకునూరు గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన నిమ్మ చందన 555 (600) మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ఉత్తమ మార్కులు సాధించి మండల స్థాయి టాపర్‌గా నిలవడంతో గ్రామస్తులు అభినందించారు.

**ఘన సన్మానం**

పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని వాసవీనగర్‌కు చెందిన బెజగం శ్రీజ (587), ఇంటర్మీడియట్ ఎంపీసీలో గౌరిశెట్టి సాత్విక (465), గందె సహస్ర (455)మార్కులు సాధించారు. దీంతో విద్యార్థులను వాసవీనగర్ కాలనీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

# సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు ప్రారంభం

హుస్నాబాద్ టౌన్, మే 2 : వేసవి కోచింగ్ క్యాంప్‌లు హుస్నాబాద్ మినీస్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన ఫుట్‌బాల్ కోచింగ్‌లో 14 ఏండ్ల లోపు బాల, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరికి సమ్మర్ క్యాంపు ఇన్‌చార్జి, పీడీ బానోతు రాజునాయక్ ఆటకు సంబంధించిన మెళకువలను నేర్పించారు. ఈ సందర్భంగా రాజునాయక్ మాట్లాడుతూ వేసవి క్యాంప్‌ను జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు, బాల, బాలికలు ఇందులో పాల్గొనాలని ఆయన కోరారు.

# ఆలయానికి విరాళం



సామగ్రిని అందజేస్తున్న డాక్టర్ నరేశ్ బాబు

గజ్వేల్, మే 2 : గజ్వేల్ పట్టణానికి చెందిన సామాజిక సమరత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్ బాబు మర్కూక్ మండల పరిధిలోని వరదరాజస్వామి ఆలయానికి రూ. లక్ష వంట సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదరాజస్వామి దేవాలయ పు న: ప్రతిష్ట సందర్భంగా ఆలయానికి తనవంతుగా వంటసామగ్రిని బహూకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

జిన్నారం, మే 2: ఇటీవల జిన్నారం మండల కేంద్రంలో విగ్రహ ధ్వంసం జరిగిన ఘటనలో అరెస్టు అయిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్సీ అంజిరెడ్డి పరామర్శించారు. అరెస్టుల నేపథ్యంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. నాయకులు నర్సింగరావు, కుర్మ రవి, పల్నాటి శ్రీనివాస్, సుధాకర్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.